అంతటా పండగ శోభ

గాజువాక మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి



బాణసంచా స్టాల్ వద్ద కొనుగోలుదారులు


గాజువాక మార్కెట్‌లో దుకాణాల వద్ద కొనుగోలుదారులు

గాజువాక: దీపావళి సంబరాలకు గాజువాక సిద్ధమైంది. పండగ సామగ్రి కొనుగోలుదారులతో ఇక్కడి మార్కెట్లలో శనివారం సందడి చోటు చేసుకుంది. బాణసంచా విక్రయాలు గాజువాకలో ముందుగానే ప్రారంభమైన విషయం తెలిసిందే. గాజువాక పట్టణంలో మూడు చోట్ల బాణాసంచా విక్రయ కేంద్రాలను వ్యాపారులు ప్రారంభించారు. షీలానగర్, ఆదర్శ గ్రౌండ్, స్టీల్‌ప్లాంట్‌లో ఈ విక్రయాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయి. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ కో–ఆపరేటివ్ స్టోర్స్‌లో మూడు రోజులుగా భారీగా బాణసంచా విక్రయాలు జరుగుతున్నాయి. నగరంలో మిగిలిన అన్ని ప్రాంతాల కంటే స్టోర్స్‌లో తక్కువ ధరలకు లభిస్తాయనే ప్రచారంతో కొనుగోలుదారులు అధికసంఖ్యలో వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అజ్ఞాన చీకట్లను పారదోలి తమ జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ ఈ పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందులో భాగంగా దీపాలను కొట్టడానికి అవసరమైన చెరకు గెడలు, వివిధ మొక్కలకు సంబంధించిన పుల్లలను మార్కెట్‌లో భారీగా విక్రయిస్తున్నారు. ప్రమిదలు, కొవ్వొత్తుల కొనుగోలుకు సైతం జనం క్యూ కట్టారు. కాగా, ఈసారి దీపావళి సామాగ్రి ధరలు నింగినంటాయని పలువురు కొనుగోలుదారులు చెబుతున్నారు.


ప్రమిదలు కొనుగోలు చేస్తూ..

కార్తీక మాసోత్సవాల కరపత్రం ఆవిష్కరణ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడక ఉమామహేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించనున్న కార్తీక మాసోత్సవ పూజల వివరాలతో పొందుపర్చిన కరపత్రాన్ని ఆలయ కమిటీ ఆవిష్కరించింది. కార్తీక సోమవారాల్లో నిర్వహించనున్న కార్యక్రమాలు, నెలరోజుల పాటు చేపట్టనున్న ఉత్సవాల వివరాలను కమిటీ ప్రతినిధులు తెలియజేశారు. కార్యక్రమంలో నెల్లి శ్రీనివాసరావు, దానబాల అప్పలనాయుడు, కట్టా పైడిరాజు, గెద్దాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ఓబీసీ సర్వసభ్య సమావేశం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంఘం మూడో సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. స్టీల్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఉద్యోగులు పదవీ విరమణ చేసినా, మృతి చెందినా వారి కుటుంబీకులకు రూ.80 వేలు ఇవ్వడానికి తీర్మానించారు. ఓబీసీ విద్యార్థులకు ఏటా ప్రతిభా పురస్కారాలు ఇచ్చేందుకు అంగీకరించారు. సభలో గత ఆర్థిక సంవత్సరం ఆదాయ, వ్యయాలను ఆమోదించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉప ప్రధాన కార్యదర్శి కోయిలాడ శ్రీనివాసరావు, గెద్దాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా బీజేపీ అధ్యక్షుల సమావేశం

గాజువాక: త్వరలో నిర్వహించనున్న బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా భావించాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దీనంకొండ కృష్ణంరాజు కోరారు. కొత్తగాజువాకలో శనివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో నిర్వహించనున్న అధ్యక్షుల సమావేశానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సమావేశంలో నాయకులు గూటూరు శంకరరావు, కె.రమణ, బి.సూరిబాబు, కాశీ విశ్వనాథం, విఠల్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

20న వామపక్షాల సదస్సు

పెదగంట్యాడ: ఉక్కు ప్రైవేటీకరణ, వ్యవసాయ, రైతు, కార్మిక సమస్యలపై వామపక్ష ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో ఈ నెల 20న గాజువాకలోని లయన్స్ క్లబ్‌లో సదస్సు నిర్వహించనున్నామని సీపీఐ గాజువాక నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. స్థానిక పోతిన సన్యాసిరావు భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వరంగ పరిశ్రమల పరిరక్షణ, రైతు, వ్యవసాయ, కార్మిక సమస్యలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న భారత్ బచావో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అచ్యుతరావు, ఎల్లేటి శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో అన్న సమారాధన


పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని వరాహ లక్ష్మీనరసింహస్వామి ట్రస్ట్ బోర్డు మెంబర్ దొడ్డి రమణ ప్రారంభించారు. మంత్రి మంజుల, ప్రకాష్‌రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శనిత్రయోదశి పూజలు

అక్కిరెడ్డిపాలెం: శనిత్రయోదశిని పురస్కరించుకుని, అక్కిరెడ్డిపాలెంలోని శివాలయం ఎదురుగా గల శనీశ్వరాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తైలం, నవధాన్యాలతో పూజలు నిర్వహించారు.

స్ఫూర్తి అనాథాశ్రమంలో దీపావళి సంబరాలు

గాజువాక: కేఎన్నార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక స్ఫూర్తి అనాథాశ్రమంలో దీపావళి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కరణంరెడ్డి దంపతులు అనాథబాలలతో దీపాలను వెలిగించి, టపాసులను పేల్చారు. అనంతరం బాలలందరికీ టపాసులను అందజేశారు. బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు రోహిణి, నాయకులు పాల్గొన్నారు.







రామాలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి తదితరులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకలోని రామాలయ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య శనివారం పరిశీలించారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన రామాలయం జీర్ణావస్థకు చేరడంతో, ఇటీవల దానిని తొలగించి, పునర్నిర్మాణ పనులు చేపట్టారు. ఏడు నిర్వాసిత కాలనీల ప్రజల మనోభావాలకు అనుగుణంగా వీటిని నిర్మిస్తున్నామని ఆలయ నిర్మాణ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ పునర్నిర్మాణం కోసం నిధులు విడుదల చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ కరుణాకర్‌రెడ్డిని కలిసి విన్నవించనున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, రామాలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఉక్కు పరిశ్రమను చిన్న చూపు చూడడం తగదు'

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్రం చిన్నచూపు చూస్తోందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు వెయ్యి రోజులుగా పోరాడుతున్నా, కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే దీక్షల్లో 1003వ రోజు, సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొని, పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని రాష్ట్ర ప్రజలు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు కోరుతున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం


దయాల్‌నగర్‌లో గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు


షీలానగర్‌లో గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్‌లో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా దయాల్‌నగర్‌లోని గౌరీ భవనంలో ఉత్సవ మూర్తులను ప్రతిష్టించారు. ముందుగా ఆలయం నుంచి గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను వందలాది మంది భక్తులతో కలసి తప్పెట గుళ్ల, కోలాటంతో ఊరేగించారు. నెల్లిముక్కులోని పెంటమాంబ ఆలయం వద్దకు చేరుకుని గౌరీ పరమేశ్వరుల విగ్రహాలకు పూజలు చేశారు. పూజల్లో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, ఆదారి అప్పారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

షీలానగర్‌లో..

అక్కిరెడ్డిపాలెం: వెంకటేశ్వర కాలనీ షీలానగర్‌లో శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు కనులపండువగా ప్రారంభమయ్యాయి. ప్రథమ మహోత్సవాల్లో భాగంగా షీలానగర్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి గౌరీ పరమేశ్వరుల విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి, వెంకటేశ్వరకాలనీలోని కుంచుమాంబ ఫ్లోర్‌మిల్ ఎదురుగా గల స్థలంలో ప్రతిష్టించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం ప్రతినిధులు మళ్ల కుమార్, మళ్ల కాశీవెంకటసీతారం, పెంటకోట ఉమామహేశ్వరరావు, కాంగ్రేగుల కృష్ణ, శరగడం నాయుడు పాల్గొన్నారు.

గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో..

నాతయ్యపాలెం సీఎస్ఆర్ కల్యాణ మండపంలో నాతయ్యపాలెం, అక్కిరెడ్డిపాలెం గౌరీసేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల 16వ వార్షిక మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం అక్కిరెడ్డిపాలెంలోని శ్రీ కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల ఆలయం నుంచి గౌరీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా కల్యాణ మండపంలో ప్రతిష్టించారు. గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు దాడి వెంకట రమేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన


మహిళకు కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో జీవీఎంసీ 74వ వార్డు దల్లివానిపాలెం సచివాలయంలో శనివారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 147 మంది రోగులను వైద్యులు పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా పోర్టు ప్రతినిధులు మాట్లాడుతూ సీఎస్సార్ నిధులతో భవిష్యత్తులో మరిన్ని సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, పోర్టు ప్రతినిధులు అచ్చారావు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి కానుకల పంపిణీ


దీపావళి కానుకలను అందజేస్తున్న శిష్టకరణాల అసోసియేషన్ సభ్యులు

కూర్మన్నపాలెం: దీపావళి పండగను పర్యావరణహితంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సినీ డైరెక్టర్ దగ్గువలస దివాకర్ కోరారు. కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దీపావళి కానుకల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అసోసియేషన్ చేస్తున్న సేవలను ప్రశంసించారు. అనంతరం స్వీట్లు, ప్రమిదలను సభ్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి డి.సత్యారావు, అధ్యక్షులు పి.ఎస్.వి.ఎస్.గోపాల్, ప్రతినిధులు డబ్బీరు గురునాధం, గర్భం నాగేశ్వరరావు, ప్రసాద్, శేఖరమంత్రి శ్రీనివాసరావు, బలివాడ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో వైభవంగా లక్ష్మీ పూజ


పూజలో పాల్గొన్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్, ఉన్నతాధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో దీపావళి పూజను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉక్కు అడ్మిన్ భవనంలోని ఫైనాన్స్ విభాగానికి చెందిన కార్పొరేట్ ట్రెజరీలో నిర్వహించిన పూజల్లో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (కమర్షియల్) మొహంతి, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.కరుణరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఉద్యోగులకు సీఎండీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఫైనాన్స్ విభాగాధిపతి వి.శాంత కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అనాథబాలలకు నిత్యావసర సరకులు


సరకులను అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

పెదగంట్యాడ: భగవాన్ పితామహ పత్రీజీ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పత్రీజీ పిరమిడ్ స్పిరిట్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. 64వ వార్డు వెంకన్నపాలెంలోని మదర్ థెరిసా స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్‌కు నిత్యావసర సరకులు అందజేశారు. ముందుగా ట్రస్ట్ కార్యదర్శి మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం పిల్లలతో ధ్యానం చేయించారు. థెరిసా స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు పద్మావతి, సొసైటీ సభ్యులు భాగ్యగౌరి, నీలకంఠం, సత్య, దేవిక, పాల చిన అప్పారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.